క్లుప్తంగా

విశేషంగా నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశేషంగా రాపత్తు ఉత్సవాలు



వామనుడి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు బుధవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వామనుడిగా దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వామనుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

చల్లగ చూడు దుర్గమ్మా



పెందుర్తిలో అగ్ని గుండం తొక్కుతున్న భవానీ భక్తులు

పెందుర్తి: పెందుర్తి నూకాంబిక దుర్గా భవానీ భక్తి పీఠం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. మహా చండీయాగం నిర్వహించారు. అనంతరం భవానీ భక్తులు అగ్ని గుండం తొక్కి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

శారదాపీఠాన్ని సందర్శించిన రామచంద్రయాదవ్



స్వామీజీ ఆశీసులు తీసుకుంటున్న రామచంద్రయాదవ్

పెందుర్తి: భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ బుధవారం చినముషిడివాడలోని శ్రీశారదాపీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీసులు తీసుకున్నారు. ముందుగా పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తులకు రామచంద్రయాదవ్ పూజలు చేశారు.

'ఐక్య ఉద్యమాలను దెబ్బ తీయవద్దు'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న ఐక్య ఉద్యమాలను దెబ్బ తీయవద్దని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిందాల్ అంశంపై మొదటి నుంచి కార్మిక సంఘాలు యాజమాన్యం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయన్నారు. పోరాట కమిటీ సమావేశంలో చేసిన నిర్ణయం మేరకు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి చేపట్టామన్నారు. కార్మిక సంఘాలు, పోరాట కమిటీపై కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అటువంటి ఆరోపణలు పోరాటానికి నష్టం కలిగిస్తాయన్నారు. యాజమాన్యం జిందాల్ ఒప్పందాన్ని రద్దు చేయడం, కార్మికులకు వేతన సవరణ చేయడం తదితర డిమాండ్లపై పోరాటం కొనసాగుతుందన్నారు.

ప్రగతి బాట



కొత్త గొర్లివానిపాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు



డి.గొర్లివానిపాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు



- అద్దంలా రోడ్ల అభివృద్ధి
- రహదారి కష్టాలకు చెక్
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పరవాడ నుంచి భర్నికం వరకు నిర్మించిన బీటీ రోడ్డు

రూ.60 లక్షలతో పరవాడ-భర్నికం బీటీ రోడ్డు నిర్మాణం

రూ.13.లక్షలతో డి.గొర్లిపాలెం సీసీరోడ్ల అభివృద్ధి

రూ.7 లక్షలతో మరశవానిపాలెంలో సీసీ రోడ్ల ఏర్పాటు

పరవాడ: పరవాడ–అనకాపల్లి మార్గంలో ప్రయాణమంటే వాహనదారులు, ప్రయాణికులు భయపడేవారు. మోకాలి లోతు గుంతలతో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. అనకాపల్లి టౌన్‌కు ద్విచక్ర వాహనంపై చేరడానికి నానా అవస్థలు పడేవారు. అరగంట ప్రయాణానికి గుంతల కారణంగా గంటన్నర సమయం పట్టేది. గుంతల మార్గంలో రాకపోకలు సాగించే ఆటోలు తరచూ రిపేర్లతో మూలకు చేరేవి. ఇది గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు దుస్థితి.

నేడు: ఆ కష్టాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే అభివృద్ధిపై దృష్టి సారించారు. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని రహదారులను ప్రగతి బాట పట్టించారు. శిథిలమైన తారు రోడ్లకు చికిత్స చేశారు. మట్టి రోడ్లను సీసీ రహదారులుగా మార్చారు. మెటల్ రోడ్లతో అవస్థలు పడుతున్న పల్లెలను గుర్తించి అటువంటి చోట్ల సిమెంటు రోడ్లను నిర్మించి పల్లె ప్రజల అవస్థలకు చెక్ పెట్టింది.

- పరవాడ–భర్నికం రోడ్డును రూ. 60 లక్షల నిధులతో తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. దీంతో ప్రయాణికుల కష్టాలు గట్టెక్కాయి.
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలో 14 గ్రామ సచివాలయాలకు ప్రభుత్వం రూ 2.80 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో సచివాలయానికి రూ. లక్షలు కేటాయించింది. ఆ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- రూ.13 లక్షలు వెచ్చించి కొత్త గొర్లివానిపాలెంలో సీసీ రోడ్డు, దిబ్బల గొర్లివానిపాలెంలో మూడు సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు.
- మరిశవానిపాలెంలో రూ.7 లక్షలు వెచ్చించి రెండు సీసీ రోడ్లు వేశారు. మిగిలిన నిధులతో మరికొన్ని అభివృద్ధి పనులు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

వీధి రోడ్లు బాగుపడ్డాయి



గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్‌తో ప్రజల కష్టాలు తీరాయి. గతంలో గ్రావెల్ రోడ్డు ఉండడం వల్ల మహిళలు అవస్థలు పడేవారు. రాళ్లు తేలిన రోడ్డులో వెళ్లి రావడానికి ఇబ్బందులు వర్ణణాతీతం. సీసీ రోడ్డు నిర్మించిన తర్వాత సౌకర్యంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు.

– పోలిరెడ్డి అప్పారావు, డి.గొర్లివానిపాలెం

ప్రమాదాలు తగ్గాయి



పరవాడ–అనకాపల్లి రోడ్డును ప్రభుత్వం అభివృద్ధితో ప్రయాణికులకు కష్టాలు తప్పాయి. మోకాలి లోతు గుంతల వల్ల నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారిన పడేవారు. గత ప్రభుత్వం గుంతల రోడ్డు అభివృద్ధికి కనీస చర్యలు తీసుకోలేదు. సీఎం జగనన్న రూ.60 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించి మా కష్టాలు తీర్చారు. ఫలితంగా ప్రమాదాలు కూడా తగ్గాయి.

– పైల పైడింనాయుడు, పరవాడ

అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోండి

- జెడ్పీటీసీ సన్యాసిరాజు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సన్యాసిరాజు

పరవాడ: మండలంలోని అక్రమ క్వారీలతో పాటు ప్రభుత్వ భూములు, గెడ్డలు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ పి.కనకారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పరవాడ సర్వే నంబరు 11, తాడి సర్వేనంబరు 116తో పాటు ఈ.బోనంగి, దేశపాత్రునిపాలెం, పెదముషిడివాడ గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమ క్వారీలు నిర్వహిస్తున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం మానేసిందని ఆరోపించారు. పెదముషిడివాడలో సర్వే నంబర్లు 365, 367, 407,409,393లలోని ప్రభుత్వ స్థలాల్లో గ్రావెల్ అక్రమంగా తవ్వుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్వి లేఅవుట్లు వేసి అమ్మకాలు సాగించి సొమ్ముచేసుకుంటున్నారన్నారు. అక్రమార్కుల ఆగడాలతో ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడమే కాకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని జెడ్పీటీసీ రాజు హెచ్చరించారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతి



ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనుబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి బుధవారం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు వినతిపత్రం అందజేశారు. మూడు కోట్లతో చేపట్టనున్న ఘాట్‌రోడ్డు పూర్తి చేయడంతో పాటు సింహగిరిపై తిరునామాలు ఏర్పాటు చేయాలని, శ్రీనివాసనగర్‌లో నిర్మించిన కల్యాణ మండపాలను ప్రారంభించాలని కోరారు.

సెయిల్‌తో ఎంవోయూ చేయాలి



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జిందాల్‌తో కాకుండా సెయిల్‌తో ఎంవోయూ చేయాలని స్టీల్‌ప్లాంట్ నాన్ జేసీఎం (ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటూ యేతర) కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నాన్ జేసీఎం సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద బుధవారం చేపట్టిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. జిందాల్‌తో ఒప్పందం ప్లాంట్‌కు నష్టదాయకమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్‌తో ఒప్పందం చేస్తే ఇరు సంస్థలకు లాభదాయకమన్నారు. జిందాల్ ఎంవోయూ వ్యవహారంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటూ పై కార్మికుల్లో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, వరసాల శ్రీనివాసరావు, డి.వి. రమణ, కరణం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి అభ్యసనే మేలు

బీచ్‌రోడ్డు: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడానికి క్షేత్రస్థాయి అభ్యసన దోహదపడుతుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఎండీ షేక్ షిరీన్ బేగం అన్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో స్కాలాస్టిక్–ఎడ్యు–డిపోట్(ఎస్ఈడీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఫిజిక్స్ పరికరాల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు విద్యా బోధన సులభతరంగా ఉండేందుకు సైన్స్ పరికరాలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తే శాశ్వతంగా గుర్తుండిపోతుందని సూచించారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఘనంగా ఉక్కు ఆస్పత్రి ఆవిర్భావ దినోత్సవం



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి ప్రకాశ్, అతిథులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి, విజయ డయాగ్నస్టిక్స్ వైద్యులు డాక్టర్ ఎస్.సంతోష్ అతిథులుగా హాజరయ్యారు. డైరెక్టర్ బాగ్చీ మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబీకులకు ఆస్పత్రి విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ మాట్లాడుతూ వైద్యులు మరింత అంకితభావంతో సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఏటా బెస్ట్ డాక్టర్‌కు ఇచ్చే కొప్పిచ్చి కృష్ణమూర్తి బంగారు పతకాన్ని ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సౌజన్యకు, బెస్ట్ నర్స్‌కు ఇచ్చే లక్ష్మీ ప్రభాకర్ రజత పతకాన్ని సిస్టర్ అన్నపూర్ణకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆవిర్భావ దినోత్సవ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి జీఎంలు డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్, డాక్టర్ ఎస్.ఎన్. సారంగి, మెడికల్ కమిటీ ప్రతినిధులు ముసినాడ శ్రీనివాస్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ అదే జోష్

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు



95వ వార్డులో పోటీలను ప్రారంభిస్తున్న ముమ్మన దేముడు



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న చందుయాదవ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ నాగమణి

పెందుర్తి: యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం నిర్వహించిన క్రీడా పోటీలు నియోజకవర్గంలో ఉత్సాహభరితంగా సాగాయి. జీవీఎంసీ 95వ వార్డులోని పలు ప్రాంతాల్లో క్రీడా పోటీలను కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభించారన్నారు. క్రీడాకారులను ప్రభుత్వం అన్నివిధాల ప్రోత్సహిస్తుందన్నారు.

- మండలంలోని ఎస్.ఆర్ పురంలో ఎంపీపీ మధుపాడ నాగమణి క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పిలి దేవి తదితరులు పాల్గొన్నారు. – పురుషోత్తపురంలో క్రీడా పోటీలను సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్ ప్రారంభించారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. 20 గ్రామ సచివాలయాల్లో బ్యాడ్మింటన్, క్రికెట్,వాలీబాల్,కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి 338 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉందని ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు. బుధవారం పలు క్రీడాంశాలకు సంబంధించి 96 మ్యాచ్‌లు నిర్వహించారు. తొలి రోజు మంగళవారం 95 మ్యాచ్‌లు నిర్వహించినట్లు తెలిపారు. మరో 147 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉందన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల నుంచి 5 క్రీడాంశాలకు గాను 399 పురుషుల టీమ్‌లు, 233 మహిళల టీమ్‌లు వచ్చాయని చెప్పారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

సింహాచలం: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు బుధవారం 93వ వార్డులో ఘనంగా ప్రారంభమయ్యాయి. 492,493 సచివాలయాల పరిధిలో వారికి క్రికెట్ పోటీలను సాయిమాధవనగర్ మైదానంలో 93వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు ప్రారంభించారు. మొత్తం నాలుగు టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–8 డీఈ విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వినోద్, బండి సత్తిబాబు, శ్రీకాంత్, జిలాని, అరస, 492 అడ్మిన్ శ్రీకాంత్, 493 సచివాలయం అడ్మిన్ లచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



బంగారమ్మపాలెంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



93వ వార్డులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సత్తిబాబు

'ప్రకృతి వనం' ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1లో ప్రకృతి వనం పార్కును స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ బుధవారం ప్రారంభించారు. విభాగంలో ఉన్న పాత డంపింగ్ యార్డును ఉద్యోగులు ఇతర విభాగాల సహకారంతో పార్కుగా అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా సీఎండీ భట్ మాట్లాడుతూ విభాగంలోని స్క్రాప్‌ను వినియోగించి అందమైన పార్కుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన తరంగ్ వాటర్ ఫౌంటెన్‌ను, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) బాగ్చీ లెహర్ ఫౌంటెన్‌ను ప్రారంభించారు. పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎస్.వి. స్వామి, ఇతర సీజీఎంలు ఎ.కె. సోట్టీ, యు.శ్రీధర్, ఎస్.ఎం.ఎస్ విభాగం సీజీఎం పి.ఎస్.రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం దుర్గాప్రసాద్‌కు సత్కారం



జీఎం దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న ఇంజనీరింగ్ షాప్స్ ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ విభాగాధిపతి, జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్‌ను ఉద్యోగులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగాధిపతిగా విధులు నిర్వహించి, కోక్ ఓవెన్స్ విభాగానికి బదిలీ అయిన దుర్గాప్రసాద్‌ను ఇంజినీరింగ్ షాప్స్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఇంజినీరింగ్ షాప్స్ నూతన విభాగాధిపతి పాండే మాట్లాడుతూ విభాగం అభివృద్ధికి దుర్గాప్రసాద్ ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన బాటలోనే నడిచి ప్లాంట్‌కు తగిన సేవలు అందిస్తామన్నారు. సన్మాన గ్రహీత దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తనకు ఇంజినీరింగ్ షాప్స్‌తో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తనకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధికారులు పాల్గొన్నారు.